ఇక ఫ్లోరైడ్ రహితమే!

ఆ పల్లెలో ఫ్లోరైడ్ భూతం పారిపోయే సమయం ఆసన్నమైంది. గ్రామంలోని గిరిజనులకు ఇక సురక్షిత తాగునీరు అందనుంది. అధికారులు చొరవతో గిరిజనానికి మినరల్ వాటర్ ప్లాంట్ అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ఆ ఊరిలో వాటర్ ప్లాంట్ సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ఆ ప్లాంట్ ప్రారంభించనుండడంతో గిరిజనులకు శుద్ధజలం అంది, వ్యాధుల బారి నుంచి గట్టెక్కనున్నారు.

- డీసీ కండ్రిగలో తీరనున్న సమస్య
- ముమ్మరంగా ఆర్ఓ ప్లాంట్ పనులు
- త్వరలో ప్రారంభానికి సిద్ధం


ధర్మచాట్లవారి కండ్రిగ ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేస్తున్న ఆర్వో సిస్టమ్


గదిలో అమర్చిన వాటర్ ట్యాంక్‌లు

వెంకటగిరిరూరల్: మండలంలోని సోమసానిగుంట పంచాయతీలోని ధర్మచాట్లవారి కండ్రిగ ఎస్టీ కాలనీలో నెలకొన్న ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కానుంది. గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య నెలకొన్న విషయం తెలుసుకున్న యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమీషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కొద్దిరోజుల క్రితం గ్రామంలో పర్యటించి, గిరిజనులు బాగోగులపై ఆరా తీశారు. దీంతో ఆ గిరిజనులకు తాగునీటి సమస్య ప్రధానంగా ఉందని ఫ్లోరైడ్ వాటర్ తాగడంతో కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నామని వివరించారు. దీంతో వారు సమస్యను ఎంపీడీఓ కరిముల్లా, తహసీల్దార్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చొరవచూపాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ కరిముల్లా పంచాయతీరాజ్ నిధుల మంజూరు చేయించి, గ్రామంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. దీంతో గ్రామంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు భవన నిర్మాణం, పైప్‌లైన్, మోటారు, ఆర్వో యంత్రాలకు రూ. 4.50 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి, ఉన్నతాధికారులకు పంపారు. వారు స్పందించి నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరలో పనులు పూర్తి చేసి, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆ గ్రామంలో ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందనుంది.

రూ.2 లక్షలు మంజూరు



ధర్మచాట్లవారి కండ్రిగ ఎస్టీకాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి పంచాయతీరాజ్ నిధులు రూ.2 లక్షలు మంజూరు చేశాం. ఆర్వోప్లాంట్, పైప్‌లైన్, మోటార్ల మరమ్మతు తదితర వాటికి ఈ నిధులు వినియోగించాం. పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరలో ప్లాంట్ ప్రారంభించనున్నారు.

– శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వెంకటగిరి

రుణపడి ఉంటాం



గ్రామంలో ఫ్లోరైడ్ నీరు వస్తోంది. ఆ నీరు తాగులేక ఇబ్బందులు పడుతున్నాం. విధిలేని పక్షంలో ఆ నీరు తాగి కిడ్నీ వ్యాధుల బారిన పడి, బాధపడాల్సిన పరిస్థితులు తలెత్తున్నాయి. మా కష్టాలను గుర్తించి మాకు తాగునీటిని అందించడానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటాం.

– చెంచమ్మ, ధర్మచాట్లవారి కండ్రిగ ఎస్టీకాలనీ

విదేశాల్లో నేటికీ టికెట్‌పైనే నాటక ప్రదర్శన

- సినీనటుడు భానుచందర్‌తో ముఖాముఖి



ప్రముఖ సినీ నటుడు బానుచందర్ బుధవారం గూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో కాసేపు సాక్షి మాటామంతి కలిపింది. ఈ సందర్భంగా ఆయనతో పంచుకున్న విషయాలిలా ఉన్నాయి. –గూడూరు

ప్రశ్న: మీ పుట్టిన స్థలం?
జవాబు: చెన్నైలో పుట్టా. మా స్వస్థలం కృష్ణా జిల్లా బందరు.
ప్ర: సినీరంగ ప్రవేశం ఎలా జరిగింది?
జ: 1977లో నాలాగే ఎందరో అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశాను.
ప్ర: సినీ రంగ ప్రవేశానికి ఆదర్శం ఎవరు?
జ: మా తల్లిగారు, శకుంతల వేణు. మా తండ్రి మాస్టర్ వేణు సంగీత దర్శకుడిగా అందరికీ సుపరిచితుడు. అయితే ఆయన తెర వెనక మాత్రమే ఉండడంతో నన్ను తెరపై చూడాలని సినీ నటుడుగా మద్రాస్ పిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో జాయిన్ చేశారు.
ప్ర: ఇప్పటి వరకు ఎన్ని చిత్రాల్లో నటించారు?
జ: నేను ఇప్పటివరకు తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ భాషల్లో 170 చిత్రాలలో నటించా. ప్రస్తుతం వార్‌మెన్, రామ్, మూజ్యిక్ షాపు మూర్తి, శుభలగ్నం సినిమాల్లో నటిస్తున్నా.
ప్ర: అవార్డులు సాధించారా?
జ: నంది అవార్డులు తీసుకున్నప్పటి కీ ప్రజల నుంచి వచ్చే అభినందనలే అవార్డులతో సమానం. మంచి మనసులు సినిమాలోని 'జాబిల్లి కోసం ఆకాశమల్లే' అనే పాట సినిమా పరిశ్రమ ఉన్నంత వరకు ఉంటుంది.
ప్ర: గుర్తింపు తెచ్చిన చిత్రాలు ఏవి?
జ: మెరుపుదాడి, నిరీక్షణ, ముక్కుపుడక, తరంగిణి చిత్రాలు ఎప్పటికీ గుర్తుండి పోతాయి.
ప్ర: సినీ రంగం, నాటక రంగానికి తేడా ఏమిటి?
జ: సినీ రంగం, నాటక రంగ వేర్వేరు. నాటక రంగంలో టేక్‌లుండవు, ఏకంగా ప్రేక్షకుల ముందు జీవించాలి, అప్పడే నాటకంలో ఉన్న పాత్రలు, నటులు సహజంగా ఉంటారు.
ప్ర: నాటక రంగంపై మీ అభిప్రాయం?
జ: ప్రభుత్వాలు నాటక రంగాన్ని అబివృద్ధి చేస్తే నటులు కొత్తగా పుట్టుకు వస్తారు. లండన్, అమెరికాలో నేటికీ నాటకాలను టికెట్ పెట్టి చేస్తున్నారు. సాంకేతికత పెరిగిపోవడంతో మన దేశంలో సినిమాలను కూడా నేడు థియేటర్‌లో కాకుండా సెల్ ఫోన్‌లో చూస్తుండడంతో భవిష్యత్తులో కళలపై మక్కువ తగ్గిపోతుందేమోనన్న అనుమానం వస్తోంది.

చిరు వ్యాపారులకు స్థలాల కేటాయింపు


లక్కీడిప్‌లో వ్యాపారులకు స్థలాలను కేటాయిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్

కోట: బజారువీధిలో ఆక్రమణల తొలగింపు కారణంగా దుకాణాలు కోల్పోయిన చిరు వ్యాపారులకు బుధవారం లక్కీడిప్ ద్వారా పంచాయతీ స్థలాలను అధికారులు కేటాయించారు. ఆక్రమణల తొలగింపులో నష్టపోయిన చిరు వ్యాపారాలు చేసుకునే దుకాణ యజమానులు అధికంగా ఉండడంతో వారు ఆర్డీఓను కలసి తమను ఆదుకోవాలని కోరారు. పంచాయతీ స్థలాన్ని వ్యాపారులకు కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జున్, కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ వెంకటరమణమ్మ సమక్షంలో లక్కిడిప్ ద్వారా 28 మంది వ్యాపారులకు స్థలాలు కేటాయించారు. తాత్కాలికంగా అక్కడ వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయినాథ్

గూడూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు, త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డు సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయిన వెంటనే ఇవ్వాల్సిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సకాలంలో పూర్తి చేయలేని పక్షంలో పట్టాలను రద్దు చేస్తామని చెప్పారు.

అంకితభావంతో పని చేయండి


రికార్డులు పరిశీలిస్తున్న నెల్లూరు ఆర్డీఓ

సైదాపురం: అంకితభావంతో పని చేయాలని నెల్లూరు ఆర్డీఓ మలోల ఆదేశించారు. బుధవారం సైదాపురంలో సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీఓ మండలంలోని జోగిపల్లి గ్రామంలో సర్వే రాళ్లను ఏర్పాటును పరిశీలించారు. సర్వే రాళ్ల ఏర్పాటు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్డీఓ మలోల ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ విజయలక్ష్మి, రీసర్వే డీటీ ప్రసాద్, ఆర్ఐ అశ్వర్థనారాయణ, సర్వేయర్ హాజరత్తయ్య ఉన్నారు.

దర్గాలో ఎమ్మెల్సీ మేరిగ ప్రార్థనలు


నూర్‌షావల్లి దర్గాలో మేరిగ మురళీధర్

రాపూరు: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ రాపూరులో నూర్‌షావల్లి దర్గాలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన రాపూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆకలివలసలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మందా చంద్రమోహన్ తండ్రి ఉత్తరక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం తెలుగుగంగ అతిథిగృహంలో ప్రజలతో చర్చించారు. తరువాత నేదురుమల్లితో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన వెంట జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, శశిధర్‌రెడ్డి, పీ వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, డీ రమణయ్య, ఖాదర్ బాషా, ఖాజాఉద్దీన్, పిచ్చిరెడ్డి ఉన్నారు.

సీఎం జగన్ ముస్లిం పక్షపాతి

గూడూరు: హజ్‌యాత్రకు వెళుతున్న ముస్లింలకు, నేరుగా వారి ఖాతాల్లో రూ.కోట్లు జమ చేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూం మోహిద్దీన్ అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన ముస్లింలతో కలసి మాట్లాడుతూ విజయవాడలోని గన్నవరం ఎంబార్‌కేషన్ నుంచి హజ్‌యాత్రకు వెళుతున్న 1,814 మంది హాజీలకు రూ.14.51 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహీర్, జమీర్, యస్థానీ, బాబు, షాకీర్, గయాజ్, షరీఫ్, మున్నా, వాజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శిగా రమేష్

పెళ్లకూరు: ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయుడుపేట డివిజన్ కార్యదర్శిగా పాలచ్చూరు వీఆర్వో బూదనం రమేష్ బుధవారం ఎన్నికయ్యారు. దీంతో ఆయనకు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షుడు వెంకటరత్నం, వీఆర్వోలు రవిచంద్ర, సుధాకర్, మునిరాజా అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రమేష్ పేర్కొన్నారు.

అప్రమత్తత అవసరం


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి హిమజ

ఓజిలి: ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి హిమజ అన్నారు. మండలంలోని మానమాలలో 104 సిబ్బందితో కలసి రోగులకు బుధవారం వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఎండలో ఎక్కువగా తిరగకూడదన్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ వాడాలన్నారు. రోజుకు 7 లీటర్ల నీటిని తీసుకోవాలని, అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలని తెలిపారు. రోగులకు రక్త, బీపీ, ఆస్తమా తదితర పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మానస, రమణమ్మ, సుధాకర్, మెహతాబ్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

దక్కిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని వెంకటగిరి ఐసీడీఎస్ పీఓ శాంషాద్‌బేగం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ అనిమియా మానిటరింగ్ నూరుశాతం చేయాలని సూచించారు. ఈ విధులను నిర్వహించకపోతే కార్యకర్తలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గర్భిణి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సూపర్‌వైజర్ కల్పలత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

చిల్లకూరు: సముద్ర తీర ప్రాంతంతోపాటుగా గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అటవీ అధికారులు తెలిపారు. మండలంలోని సముద్ర తీరంలోని తీగపాళెం, వరగలి గ్రామాల్లో బుధవారం ప్లాసిక్ వ్యర్థాలను ఏరి వేసే కార్యక్రమం చేపట్టి, ఆ ప్రాంతవాసులకు అవగాహన కల్పించారు. అటవీ అధికారులు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువ అవుతుందని, దీన్ని తగ్గించేందుకు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారులు గాయం శ్రీనివాసులు, అమీనయ్య, వరగలి బీట్ అధికారి గోపాకృష్ణ, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు తమిళుల ప్రశంసలు


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: రాష్ట్రంలో ప్రజారంజక, సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రంలోని తమిళుల నుంచి సైతం ప్రశంసలు అందుతున్నాయని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం తడ మండలం రామాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాపురంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని కిలివేటి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని గురించి వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ గతంలో పాలకులు ప్రజల కష్టాలు గాలికి వదిలి, దోచుకోవడం, దాచుకోవడం అనే విధానంలో పాలన చేసే వారని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్, నాయకులు రాధాకృష్ణ, ఎంపీపీ కే రఘురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి, డీసీఎంఎస్ డైరెక్టర్ జీ సురేష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌కే సుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, నాయకులు ఆర్ముగం, కోదండం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

గ్రద్దగుంట పంచాయతీ సర్పంచ్ కాటయ్యను ఎమ్మెల్యే కిలివేటి పరామర్శించారు. కాటయ్య కుమారుడు నారాయణ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గ్రద్దగుంటలోని కాటయ్య ఇంటికి చేరుకుని మృతుడు నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాటయ్యను ఓదార్చారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగవోలు, మిట్టపాళెం, పెదయాచసముద్రం, తిమ్మనగుంట గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి, నాగవోలు సర్పంచ్ కేశాని సుజాత, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఆల్తూరుపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు పాదిలేటి దశరథరామిరెడ్డి, తీర్థంపాడు సర్పంచ్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, రమణారెడ్డి, వేణు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగవోలులో గడప గడపకు..

మండలంలోని నాగవోలు, చాపలపల్లె, వడ్డిపల్లె గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పరిశ్రమ వ్యర్థాలపై అధికారులు ఆరా


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడులో ఉన్న ఓ స్టీల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలపై బుధవారం ఆర్డీఓ చంద్రముని, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఆరా తీశారు. అనంతరం పరిశ్రమతోపాటు చెరువు, కాలువలు, కలుజులను పరిశీలించారు. ఇటీవల పరిశ్రమ ఆవరణలోని వ్యర్థ జలాలను దిగువ ప్రాంతంలోని చెరువులోకి వదిలివేయడంతో సుమారు రూ.50 లక్షలు విలువ చేసే చేపలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు పరిశ్రమతోపాటు చెరువును పరిశీలించారు. వారు మాట్లాడుతూ పరిశ్రమలో వెలువడిన వ్యర్థ జలాలతోపాటు చెరువు నీటిని పరీక్షల నిమిత్తం నెల్లూరు, హైదరాబాద్ ల్యాబ్‌లకు పంపామని చెప్పారు. ల్యాబ్ రిపోర్ట్ అందిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలు చెరువులో కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, పొల్యూషన్ కంట్రోల్ డీఈ సుధాకర్, డీఎల్‌పీఓ వెంకటరమణ, తహసీల్దార్ రామయ్య, ఆర్ఐ సంతోషిణి, ఈఓపీఆర్‌డీ విజయమ్మ, వీఆర్వో మొబీనా పాల్గొన్నారు.

అటవీ భూముల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

చిల్లకూరు: మోమిడి రెవెన్యూ పరిధిలోని అటవీ భూముల్లో సిలికా గనుల నిర్వహణకు సంబంధించి అనుమతుల విషయమై ఆ భూములను బుధవారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మోమిడిలోని రిజర్వు ఫారెస్టుకు సంబంధించిన సర్వే నంబర్ 692లో సుమారు 34 ఎకరాల్లో సిలికా గనుల నిర్వహణకు అనుమతులు కోరుతూ కొంత మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆ భూముల స్థితిగతులపై ఆరా తీసే క్రమంలో ఆర్డీఓ భూములను పరిశీలించి ఆ ప్రాంతంలో ఎంత మేర రిజర్వు ఫారెస్టు ఉందనే విషయాలను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకుని, ఆ ప్రాంతానికి చెందిన మ్యాప్‌ను పరిశీలించారు. ఆయన వెంట చిల్లకూరు తహసిల్దార్ అజ్మతుల్లా ఖాన్, ఆర్ఐ రమ్యస్వాతి, సర్వేయర్ రామ్‌కుమార్, విఆర్ఓ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కోడి పందేం స్థావరాలపై దాడులు


పోలీసులు అదుపులోకి తీసుకున్న జూదరులు

వెంకటగిరిరూరల్: గ్రామ శివారులో కోడి పందేం స్థావరాలపై వెంకటగిరి ఎస్ఐ జిలానీ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మండలంలోని చెలికంపాడులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ జిలానీ కథనం మేరకు.. చెలికంపాడు శివారులో కోడిపందాలు ఆడుతున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఎస్ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. ఆ సమయంలో పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి ఒక కోడిపుంజ, రూ.2,350 నగదు స్వాధీన చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సత్వర సేవలు అందించాలి


ఆన్‌లైన్ రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: సమస్యలపై సచివాలయల వద్దకు వచ్చే వారితో స్నేహపూరితంగా వ్యవహరిస్తూ సేవలను సత్వరం అందించాలని సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం, లోతువానిగుంట, బీఎంఆర్ నగర్ సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయల పరిధిలో ఇప్పటి వరకు అందించిన సేవలు, వచ్చిన అర్జీలు, ఎన్ని పరిష్కారించారన్న విషయాలపై ఆరా తీశారు. ఆయన వెంట గోవర్ధన్ ఉన్నారు. అనంతరం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పుదూరులో జరుగుతున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయాలని చెప్పారు.

క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కోట: గూడలిలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అర్చకులు అనంతాచార్యులు, నరేష్‌శర్మ స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా చేశారు. భక్తులకు అన్నదానం చే శారు. ఆములూరు నాగార్జున్, శ్రీవల్లి, జగదీష్, నాగేంద్ర పాల్గొన్నారు.

గోశాలకు ఆవు, దూడ వితరణ


చైర్మన్ అంజూరుకు ఆవు, దూడను అందజేస్తున్న రామ్‌సాయి

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థాన గోశాలకు బుధవారం నాయుడుపేటకు చెందిన రామ్‌సాయి తన కుటుంబ సభ్యులతో కలసి ఆవు, దూడను ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. గోసంరక్షణకు రూ.5116 విరాళమిచ్చారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం వారిని శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు, కార్యక్రమంలో గోశాల, దేవస్థానం సిబ్బంది కామేశ్వరరావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాకు విశేష స్పందన

గూడూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు. స్థానిక ఐటీఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సేవ్ ది చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మినీ జాబ్ మేళాలో నాయుడుపేట, శ్రీసిటీకి చెందిన పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. ఈ మేళాకు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి 102 మంది హాజరయ్యారని, వారిలో 51 మంది ఇంటర్వ్యూలో అర్హత సాధించారన్నారు.

శస్త్రచికిత్సకు 20 మంది ఎంపిక


పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాయుడుపేటటౌన్: భగవతి మల్లికాంబ ఆలయం వద్ద బుధవారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు అమాస రామానారాయణ తెలిపారు. చెన్నైకు చెందిన శంకర నేత్రాలయం వైద్యుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని చెన్నైకు తీసుకెళ్లి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

రాపూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. మండలంలోని గిలకపాడు, గోనుపల్లె, తెగచెర్ల, వేపినాపిలో వలంటీర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు.ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వెంకటగిరిరూరల్: ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని మోసం చేసిన వ్యక్తిపై బాలాయపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బాలాయపల్లి ఎస్ఐ వీరనారాయణ కథనం మేరకు.. బాలాయపల్లి మండలం మల్లెమాల దళివాడకు చెందిన లక్ష్మయ్య అదే ప్రాంతానికి చెందిన ఓ యువతితో ఏడాది నుంచి ప్రేమించాడు. తీరా వివాహం చేసుకోమని ఆమె నిలదీయగా లక్ష్మ య్య నిరాకరించాడు. ఈ విషయమై ఆ యు వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోండి

చిల్లకూరు: పీఎం కిసాన్‌కు దరఖాస్తు చేసుకునే రైతులు ఈ నెలాఖారులోగా ఈకేవైసీని చేయించుకోవాలని ఏఓ గూడూరు భవానీ సూచించారు. బల్లవోలు ఆర్బీకేలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కొంత మంది రైతులతో ఈకేవైసీ చేయించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎం కిసాన్ పొందాలనుకునే రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. మండలంలో సుమారు 335 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వ్యవసాయ సహాయకులు ఎస్‌కే నషీఫా పాల్గొన్నారు.